# వినదగు నెవ్వరు చెప్పిన

## -లక్ష్మి రంగరాజన్

వేసవి సెలవులకి పుట్టింటికి వచ్చింది పావని పిల్లలతో. వాళ్లు వచ్చిన దగ్గర్నుంచి అరుంధతికి క్షణం తీరిక లేదు. ఒకటే పని. పిల్లల అరుపులు, అల్లరితో టైము తెలియడం లేదు. చిన్న కూతురు ఆమని రేపోమాపో పిల్లలతో వస్తానని ఫోను చేసింది. ఈ చిన్న యింట్లో వాళ్లతో వేగాలి. ఉన్న ఒక్క బెడ్ రూమ్‌లో ఆయనా, కొడుకు పడుకుంటే, హాలులో పిల్లలతో తను పడుకోవాలి. పైగా ఈ వేసవిలో ఎలాగైనా ఏ.సి. ఫిట్ చేయాలని అంతా ఒకటే గోల. ఏం చేయాలో తోచడం లేదు. అదృష్టంకొద్దీ కూతుళ్లిద్దరికి గొప్పింటి సంబంధాలు కుదిరాయి. వాళ్లకే లోటూ లేదు. హాయిగా ఉన్నారు. అన్నీ అనుభవిస్తున్నారు. తామింకా ఆ స్థితికి రాలేదు. కొడుక్కిప్పడే మంచి ఉద్యోగం దొరికింది. ఓ సంవత్సరం పోయాక, వాడికీ పెళ్లి చేసేయ్యాలి. ఏంటో ఈ మధ్యతరగతి బ్రతుకులింతే మరి. నిట్టూర్చింది అరుంధతి.

పావనికి గుత్తివంకాయ, గోంగూర పచ్చడి అంటే చాలా యిష్టం. బజారుకి వెళ్లి ఏరి మరీ వంకాయలు కొనుక్కువచ్చి చేసింది. ఏంటో అత్తింట్లో అన్నీ ఉన్నా, ఈ కూతుళ్లకి పుట్టింటికి రాగానే, ఉన్న ఆ పది రోజులు అన్నీ అనుభవించాలి, హాయిగా అమ్మ చేతివంట తినాలని ఉవ్విళ్లూరుతారు. ఇద్దరికీ యిక్కడున్నప్పుడు వంట చేయడమే రాదు. అత్తారింట్లోనే నేర్చుకున్నారు. అందుకే మాటి మాటికీ, నీలా చేయడం రావడం లేదమ్మా! అని అంటుంటారు. ఒక్కోసారి తనకు అయిడియాలు యిస్తుంటారు కూడా. ఏంటో!

భోజనాలై పిల్లలంతా టీవీలో 'పోగో' ఛానల్ చూడటంలో నిమగ్నమైపోయారు. పావని తండ్రి ఎప్పటిలా, పడకేసి గుర్రుపెట్టసాగారు. వంటిల్లు సర్ది, చెంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చి హాలులో కూర్చుంది అరుంధతి.

"అమ్మా! కాసేపు నీ ఒళ్లోపడుకుంటానే'' అంటూ చిన్నపిల్లలా పడుకున్న పావనిని చూసి పిచ్చిపిల్ల! మూడు పదులు దాటినా, ఈ పిల్లచేష్టలు పోలేదు. నవ్వుకుంటూ పావని తలనిమిరింది. తొలిచూలు పిల్లకదా గారాబం ఎక్కువే మరి.

"అది సరే పావని, మీ అత్తగారు ఎలా ఉన్నారే?''

"ఆవిడకేం నిక్షేపంగా ఉంది. కడుపులో చల్ల కదలకుండా చేతికందించే కోడల్లు, పక్కనే బుజ్జగించే కూతురు ఉంటే యింకేం కావాలమ్మా. ఏం చేసినా! అదేంటోమరి, కూతురికిష్టం, పెద్దాడికిష్టమని తీసుకువెళ్లి యిస్తుంది. వండి వార్చేది నేను, తిని కూర్చునేది వాళ్లు. అక్కడ్నుంచి ఒకపుల్ల కూడా యిక్కడికి రాదు. ఒక్కోసారి నాకు ఒళ్లు మండుతోంది. ఆయనకి చెప్పినా వినిపించుకోరు. కానీ కట్నం లేకుండా, చేసుకున్నారని మురిసిపోవలసిందేగాని, ఓ అచ్చటా, ముచ్చటా లేదు. ఏంటో'' విసుగ్గా అంది పావని.

అదెప్పుడూ అంతే. ఉన్నదాంతో తృప్తిపడదు. అయినా వాళ్ల అత్తగారు చేసేది కూడా బాగాలేదు. సర్దుకు పోవలసిందే మరి.

ఉమ్మడి కుటుంబం అంటే అలానే ఉంటుంది. ఎంతైనా కూతురు కూతురే. కోడలు కోడలే. "మీ ఆయన ఫ్లాటు కొన్నారని చెప్పావే, ఎక్కడకొన్నారు, ఎంతైంది'' మాట మార్చింది అరుంధతి. "వాస్తు సరిగా లేదని, అది వద్దనుకుని, వేరే చూస్తున్నారులే. పిల్లల బడికి దగ్గర కొనమంటున్నాను. ఆ సాకుతోనైనా వేరే కాపురం వెళ్లిపోవచ్చుని. ఏంటో అమ్మా, ఆ యింట్లో అన్నీ ఉన్నా ఉండాలనిపించడం లేదు నాకు. మా అత్తగారి దగ్గర నువ్వు చాలా నేర్చుకోవాలి. బి.పి., షుగర్ రాకుండా ఎంత జాగ్రత్తపడుతుందో తెలుసా. వేళకి అన్నీ కరెక్టుగా తింటుంది. ఒక్క పని చేయదు తెలుసా! పిల్లలకి అప్పుడప్పుడు అన్నం పెడుతుంది అంతే. ఆడపడుచు, చాలా తెలివైనది తెలుసా! పిల్లలకి లంచ్‌కి ఏం చేశావు, ఈరోజు నాపిల్లలకి అదే చేసివ్వు. నా కాస్త తలనొప్పిగా ఉంది, అని ఫోను చేసి మరీ చెబుతుందమ్మా! వంటలక్కలా నేను అన్నీ చేసివ్వాలి. దానికేమయిందో ఏమో, అంటూ మా అత్తగారు ఆపపోసాలు పడటం, వెంటనే బయలుదేరి వెళ్లడం, షరా మామూలే. అందరూ పక్కపక్కనే ఉండటం వల్లేకదా ఈ బాధలు. ఆయనేమో వదలి రానంటారు. ఫ్లాటు కొన్నా అద్దెకిచ్చేస్తాను అంటున్నారు. ఏం చేయను చెప్పు'' అంటున్న పావనికేం చెప్పాలో అర్థం కాలేదు అరుంధతికి.

"అమ్మా! తమ్ముడికి ఉద్యోగం చేసే అమ్మాయిని చూడు, యిద్దరూ సంపాదిస్తేనే యిల్లు బాగా నడిచేది. మనకు తగ్గట్లు చూడు. పెళ్లయితే వాడు మారినా మారగలడు. నువ్వే వాడ్ని అదుపులో పెట్టుకోవాలి. కోడలకి అతిచనువు యివ్వకు. ఎక్కడ పెట్టాలో అక్కడ పెట్టు. అప్పుడే మేము వస్తే నువ్వు మాకు అన్నీ చేయగలవు. ఇంటి ఆడపడుచు కంటతడి పెట్టరాదన్నది వాళ్లకి వివరించి చెప్పు. ముందీ చిన్న యిల్లు మారండి. అమ్మేసి, పెద్దయిల్లు కొనుక్కోండి. హాయిగా ఉండండి. చూడు నా పిల్లలు ఎలా ఉన్నారో. ఇక్కడనుంచి వెళ్లగానే, మా అత్తగారు ఏమంటుందో తెలుసా! పిల్లలు చిక్కిపోయి నల్లబడ్డారు అంటుంది. తమ్ముడు రానీ వాడితో మాట్లాడి, ఏ.సి. ఫిట్ చేయించుకుంటాను. మా ఆయన చూడు, మామగార్కి బి.పి., షుగర్ ఉందని, ఏ.సి. ఫిట్ చేయించారు. మా యింట్లో అన్నిబెడ్‌రూమ్‌ల్లోనూ ఏ.సి. ఉంది తెలుసా!''

"పావని, నువ్వు ఈ యింట్లో పుట్టినదానివే కదా! మన ఆర్థిక పరిస్థితి తెలియదా. వాడికిపుడే మంచి ఉద్యోగం దొరికింది. ఓ సంవత్సరం పోనీ, పెళ్లి చేసేద్దాం. ఈ యిల్లు అమ్మేదానికంటే, వాడే లోన్ తీసుకుని ఓ ఫ్లాటు కొనుక్కుంటే మంచిదని అనుకుంటున్నాను. అంతా ఆ దేవుడి దయ. ఎలా రాసిపెట్టి ఉంటే, అలా జరుగుతుంది'' అంది అరుంధతి.

"బామ్మా, సారీ టు డిస్టర్బ్ యు'' అంది పదేళ్ల మనవరాలు వినయ.

"ఏంట్రా, ఏం కావాలి. చిప్స్, కారప్పూస ఉన్నాయి, తెచ్చి యివ్వనా!'' లేవబోయింది అరుంధతి.

"నోనో అమ్మమ్మా! నువ్వు అమ్మ, యిద్దరూ మాట్లాడింది విన్నాను. నేనొక్కమాట చెప్పనా? పెద్దవాళ్లని గౌరవించాలి. అమ్మ, నాన్నని అభిమానించాలి. వాళ్లకే కొరతా రాకుండా చూసుకో వలసిన బాధ్యత పిల్లలదే అని నువ్వే కదా మాకు కథలు చెప్పి నేర్పించావు. మరి, నీ కూతురికేం చెప్పలేదా! ఎప్పుడు చూసినా నాన్నతోను, బామ్మతోనూ పోట్లాడుతూనే వుంటుంది. పాపం బామ్మ! పైన పెదనాన్న, కింద మేము, ప్రక్కనే అత్తయ్యా ఉన్నాము. అలా అంతాకలిసి ఉంటే ఎంత జాలీగా ఉందో తెలుసా! అమ్మ ధోరణి అమ్మదే అయినా మమ్మల్ని స్కూలు నుంచి రాగానే చూసుకునేది బామ్మే కదా! టిఫిన్ పెడుతుంది. అన్నీ చేస్తుంది.



అత్తయ్యా కూడా ఏం చేసినా తెచ్చియిస్తుంది, తెలుసా! షాపింగ్ కేళ్తే మమ్మల్ని తీసుకెళ్తుంది. కొనిస్తుంది. అయినా ఏంటో అమ్మ ఎప్పుడూ దెబ్బలాడుతూనే ఉంటుంది. రేపు మామయ్యా నిన్ను సరిగా చూడకపోతే, అమ్మా, పిన్ని ఊరుకుంటారా చెప్పు. అమ్మమ్మా! యిప్పుడే మామయ్యాకి రోజూ క్లాసు పీకుతున్నారే వీళ్లు. అమ్మకో రూలు, నాన్నకో రూలా చెప్పు నువ్వే! అందరికీ ఒకే న్యాయం ఉండాలి. మామయ్యాకి మీరెలాగో, బామ్మ, తాతయ్యాలు మా నాన్నగారికీ అలానే కదా మరి. అమ్మా! ప్లీజ్ యిక మీదట యిలా కంప్లయింట్ చేయడం మానెయ్యి. ఈరోజు అమ్మమ్మ నీ కిష్టమని గుత్తివంకాయ చేయగానే ఆశగా తిన్నావే, అలానేకదా, అత్తయ్యా కిష్టమైనవి చేసినప్పుడు బామ్మకి అనిపిస్తుంది. ప్లీజ్ అమ్మా, నేను చిన్నపిల్లని కదా! తప్పుగా చెబితే సారీ'' అంటున్న వినయ కేసి ఆరుపదుల అరుంధతి, మూడు పదుల పావని, నోటమాట రాని మూగ వాళ్లలా చూడసాగారు. వాళ్లమదిలో మారు మూల, సుమతీ శతకంలోని వినదగు నెవ్వరు చెప్పిన, వినినంతనే వేగపడక వివరింపదగన్...'' అన్న పద్యం గుర్తుకొచ్చింది.

'నిజమే. వినయ చిన్నపిల్లే అయినా న్యాయంగా మాట్లాడింది. మనం నేర్పినవే మనకి చిలుకపలుకుల్లా అప్పచెప్పేది పిల్లలే కదా మరి! అనుకున్నారిద్దరూ'

★